
అన్నివర్గాలను ఆగం చేసిన రేవంత్ 2


2 ఉగ్రదాడి అమరుల నివాళులు


దొంగను పట్టుకున్న గ్రామస్థులు 2


www.aksharatoday.com

# అక్షర టుడే

TOWARDS... TRUTH. TRUST. TREND






25-4-2025 (FRIDAY) NIZAMABAD/KAMAREDDY EDITION PAGES-2




కామారెడ్డి జిల్లా బాస్‌గా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజు నుంచే ఎస్పీ రాజేష్ చంద్ర దూకుడుగా వ్యవహరిస్తున్నారు. అన్ని ఠాణాలు చుట్టేస్తున్న ఆయన, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. గడిచిన వారం రోజుల్లో ఇద్దరు ఎస్సైలపై సస్పెన్షన్ వేటు వేయించడమే కాకుండా.. పలువురు సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. దీంతో జిల్లా పోలీసు శాఖలో మిగతా అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది.

- అక్షరటుడే, కామారెడ్డి

# పోలీస్ బాస్ దూకుడు

• విధుల్లో అలసత్వంపై కొరడా • వారం రోజుల్లో ఇద్దరు ఎస్సైల సస్పెన్షన్ • పలువురు సిబ్బందిపైనా చర్యలు

జిల్లా పోలీసు శాఖలో ఇదివరకు కొందరు అధికారులు ఆడిందే ఆట, పాడిందే పాటలా పరిస్థితి ఉండేది. ప్రత్యేకించి ఓ సీఐ అన్నీ తానై వ్యవహరించారు. పోలీసు ఉన్నతాధికారిని తన గుప్పిట్లో ఉంచుకుని సివిల్ సెటిల్‌మెంట్లకు పాల్పడ్డారు. ఆయన చెబితే ఏ పని అయినా ఇట్టే జరిగిపోయేది. కాగా.. ఇప్పటికీ ఆయన ఓ కీలక స్టేషన్‌కు ఎస్‌హెచ్‌వోగా కొనసాగుతున్నారు. అయితే మార్చి 10న జిల్లా ఎస్పీగా రాజేష్‌చంద్ర బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిణామాలన్నీ ఒక్కసారిగా మారిపోయాయి.

**వరుస చర్యలతో వణుకు**

బాన్సువాడలో కల్లు దుకాణం వద్ద ఓ వ్యక్తి పట్ల దురుసుగా ప్రవర్తించిన ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత జుక్కల్ పీఎస్‌లో పనిచేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లను హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. బాధితుల వద్ద డబ్బులు తీసుకుంటున్నాడన్న ఆరోపణలతో జుక్కల్ హెడ్ కానిస్టేబుల్ అంబర్ సింగ్‌పై సస్పె న్షన్ వేటు వేశారు. తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పాపెట్టకుండా తన ఊరికి వెళ్లడంతో ఆయనపై సస్పెన్షన్ వేటు వేయించారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన రామారెడ్డి ఎస్సై నరేశ్‌పై ఐజీ కార్యాలయానికి రిపోర్టు పంపగా.. విధుల నుంచి తొలగిస్తూ ఐజీ చంద్రశేఖర్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

వరుస చర్యలతో మిగతా అధికారులు, సిబ్బందిలో వణుకు మొదలైంది. ఇతర ప్రాంతాల్లో కుటుంబాలు ఉన్న వారంతా అలర్ట్ అవ్వడమే కాకుండా.. సంబంధిత పోస్టింగ్ ఉన్న హెడ్‌క్వార్టర్‌లోనే ఉండిపోతున్నారు. ప్రత్యేకించి మొన్నటి వరకు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారంతా.. తాజాగా తమ తీరు మార్చుకుని ఫిర్యాదు వచ్చిన వెంటనే స్పందిస్తున్నారని తెలుస్తోంది. మరోవైపు కొందరు బదిలీ ప్రయత్నాలు కూడా చేసుకుంటున్నారని తెలుస్తోంది.

జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వెంటనే పూర్తిస్థాయి పట్టు సాధించేలా నూతన బాస్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే నిత్యం ఏదో ఒక

**తనదైన శైలిలో వ్యవహరిస్తున్న బాస్**

స్టేషన్‌కు తనిఖీకి వెళ్తున్నారు. ఉదయం కనీసం గంటకు పైగా సెల్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. తనకు ప్రజల నుంచి అందే ఫిర్యాదులపై ఆయనే స్వయంగా ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. ఎస్‌బీ విభాగాన్ని పూర్తి అప్రమత్తం చేసి.. కిందిస్థాయి అధికారులు, సిబ్బంది పనితీరుపై నివేదికలు తెప్పించుకుంటున్నారు.

## ఆత్మస్థైర్యం పెంచేందుకే సమ్మర్ క్యాంప్



మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

**అక్షరటుడే, ఇందూరు:** విద్యార్థినుల్లో ఆత్మస్థైర్యం పెంచేందుకే వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్లు సీపీ సాయి చైతన్య తెలిపారు. ఆర్‌బీవీఆర్‌ఆర్ స్కూల్‌లో వారం రోజుల సమ్మర్ క్యాంప్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. బాలికలు సమాజంలో ఎలా ఉండాలనే విషయాలను క్యాంప్‌లో వివరిస్తారని పేర్కొన్నారు. ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకునేందుకు సెల్ఫ్ మోటివేషన్ తరగతులు ఉంటాయన్నారు. ఉదయం తైక్వాండో, సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ ఉంటుం దన్నారు. ఆసక్తిగల బాలికలను శిబిరంలో చేర్పించాలని చెప్పారు. కార్యక్రమంలో మానసిక వైద్య నిపుణులు విశాల్, మోటివేషన్ స్పీకర్ శ్రీహరి, ట్రెయినీ ఐపీఎస్ సాయికిరణ్, సౌత్ రూరల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ కుమార్, యోగా మాస్టర్ కిషన్, తైక్వాండో ట్రైనర్ మనోజ్ పాల్గొన్నారు.

## వేసవి శిక్షణను వినియోగించుకోవాలి


తయారు చేసిన అల్లికలను పరిశీలిస్తున్న డీఈవో

**అక్షరటుడే, ఇందూరు:** బాల భవన్‌లో అందించే వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని డీఈవో అశోక్ సూచించారు. శుక్రవారం వేసవి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది వేసవి సెలవుల్లో బాలభవన్‌లో సుమారు 25 అంశాల్లో తర్ఫీదునిస్తున్నారన్నారు. ఉత్తమ విద్యార్థులుగా ఎదగడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ ఉమాబాల, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో హోంగార్డుల బదిలీ

**అక్షరటుడే, నిజామాబాద్/కామారెడ్డి:** నిజామాబాద్ కమిషనరేట్, కామారెడ్డి జిల్లాలో పలువురు హోంగార్డులు బదిలీ అయ్యారు. మొత్తం 38 మంది హోంగార్డులను డ్రా పద్ధతిలో బదిలీ చేశారు. నిజామాబాద్ కమిషనరేట్ నుంచి కామారెడ్డికి 38 మంది బదిలీపై వెళ్తుండగా.. కామారెడ్డి నుంచి నిజామాబాద్‌కు అంతేమంది రానున్నారు. గతంలో జిల్లాల పునర్విభజన సమయంలో హోంగార్డులకు సంబంధించి ఈ బదిలీల ప్రక్రియ కొనసాగుతుంది. తప్పనిసరిగా ఏడాది పాటు కొత్త జిల్లాల్లో పనిచేయాలని నిబంధన ఉంది. దీని ప్రకారం డ్రా పద్ధతిలో వరుసగా సిబ్బందిని పరస్పర బదిలీలు చేస్తున్నారు.

# ‘భూభారతి’తో వివాదాలకు పరిష్కారం

**అక్షరటుడే, ఇందల్వాయి:** భూభారతి పోర్టల్‌తో రైతుల భూ సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. శుక్రవారం ఇందల్వాయి రైతువేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. భూ రికార్డుల్లో తప్పులుంటే పరిష్కరించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూభారతి చట్టం తెచ్చిందన్నారు. దీంతో రైతులకు ప్రయోజనం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో స్రవంతి, తహశీల్దార్ వెంకటరావు, ఎంపీడీవో అనంతరావు, సొసైటీ ఛైర్మన్ గోవర్ధన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

**అక్షరటుడే, కామారెడ్డి:** భూభారతి చట్టంతో రైతుల భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. శుక్రవారం జుక్కల్, బిచ్కుంద మండల కేంద్రాల్లో నిర్వహించిన అవగాహన సదస్సుల్లో ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు భూభారతి పోర్టల్ ద్వారా పరిష్కరించుకోవచ్చని రైతులకు సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్లు, వ్యవసాయాధికారులు, మద్నూర్ ఏఎంసీ ఛైర్పన్ సౌజన్య రమేష్, బిచ్కుంద ఏఎంసీ కవిత ప్రభాకర్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

## పదవి కోసం పోటీ పడుతున్న కేటీఆర్, కవిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్

**అక్షరటుడే, ఇందూరు:** బీఆర్ఎస్ పార్టీ పగ్గాల కోసం కేటీఆర్, కవిత తీవ్రంగా పోటీ పడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ కుటుంబం కోసమే వరంగల్ సభ నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కేవలం కేటీఆర్.. కవిత కోసమే పనిచేస్తోందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిందన్నారు. లిక్కర్ స్కాంలో జైలుకు వెళ్లిన కవిత.. ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పవచ్చన్నారు. ప్రస్తుతం వరంగల్‌లో నిర్వహిస్తున్న సభ ఎవరికోసమో చెప్పాలని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌కు ఇవి చివరి రోజులన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, పోతన్‌కర్ లక్ష్మీనారాయణ, నారాయణ యాదవ్, శ్రీకాంత్, విజయ్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆరబెట్టిన ధాన్యాన్నే కేంద్రాలకు తేవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సంజీవ్

**అక్షరటుడే, కామారెడ్డి గ్రామీణం:** రైతులు బాగా ఆరబెట్టిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తేవాలని ఐకేపీ సెంటర్ ఇన్‌ఛార్జి సంజీవ్ సూచించారు. అడ్లూర్‌లో శుక్రవారం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం తీసుకొచ్చిన అనంతరం సంబంధించిన పత్రాలను రైతులు కేంద్రాల్లో సమర్పించాలన్నారు. కార్యక్రమంలో సెంటర్ ఇన్‌ఛార్జి మీనాక్షి, రైతులు మేడిపల్లి నర్సింహులు, తోట రాజయ్య, ప్రతాప్, రమేష్, సంతోష్, సత్యనారాయణ గౌడ్, మంగలి బుజ్జి పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**అక్షరటుడే, గాంధారి:** మండలకేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో శనివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు మాజీ సర్పంచ్ సత్యం తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన మల్లారెడ్డి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఆధ్వర్యంలో పదిమంది స్పెషలిస్ట్ వైద్యులతో ఉచిత పరీక్షలు, మందులు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గిరిరాజ్ ప్రభుత్వ కళాశాలకు అవార్డు



**అక్షరటుడే, ఇందూరు:** ఎడ్యుకేషన్ వరల్డ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇండియా హయ్యర్ ఎడ్యుకేషన్ ర్యాం కింగ్స్ 2025-26కు గాను గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు అవార్డు ప్రకటించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఢిల్లీలో అవార్డును అందుకున్నారు. అవార్డుకు ఎంపిక కావడంపై కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రంగరత్నం, పరీక్షల నియంత్రణ అధికారి భరత్ రాజ్, అకాడమీ కో-ఆర్డినేటర్ గంగాధర్, పీఆర్వో దండు స్వామి, ఎన్సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ రామస్వామి, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు.

# అన్ని వర్గాలను ఆగం చేసిన రేవంత్‌రెడ్డి

**అక్షరటుడే, ఇందూరు:** అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి అన్నివర్గాలను ఆగం చేశారని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ హయాంలో రాష్ట్ర తలసరి ఆదాయం దేశంలోనే మొదటి స్థానంలో ఉండేదని, రేవంత్ రెడ్డి 500 రోజుల్లోనే దాన్ని 11వ స్థానానికి చేర్చాడని దుయ్యబట్టారు.

గత పదేళ్లలో జీఎస్టీ వృద్ధిరేటులో రాష్ట్రం మూడోస్థానంలో ఉంటే, రేవంత్ రెడ్డి 17 నెలల కాలంలో 14వ స్థానంలోకి దిగజారిందన్నారు. మహిళల పెన్షన్, తులం బంగారం అడిగితే లాఠీఛార్జ్ చేసి 33మందిపై కేసులు పెట్టారని గుర్తు చేశారు. ఆరు గ్యారంటీలు అమలు కావడంలేదని ఆరోపించారు. తెలంగాణ కంటే 25 రాష్ట్రాలు ఎక్కువగా అప్పులు చేశాయని చెప్పారు. కేసీఆర్ పదేళ్లలో రూ. నాలుగు లక్షల కోట్లు అప్పు చేస్తే.. రేవంత్ ప్రభుత్వం ఒకే ఏడాది రూ. 1.85 లక్షల అప్పు చేసిందని విమర్శించారు. కనీసం రూ.ఐదు, పది లక్షల పెండింగ్ బిల్లులను కూడా కాంట్రాక్టర్లకు ఇవ్వడం లేదన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

### బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసం..

బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ ప్రజల కోసమని ప్రశాంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ ఒక్కడితో ప్రారంభమైన ఉద్యమం.. ప్రజలందరూ జాగృతం కావడంతో తెలంగాణ ఏర్పడిందన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. జడ్పీ మాజీ ఛైర్మన్ దాదన్నగారి విఠల్, మాజీ మేయర్ నీతూ కిరణ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## మహిళల రక్షణలో షీటీం ముందంజ



**అక్షరటుడే, కామారెడ్డి:** మహిళల రక్షణలో కామారెడ్డి జిల్లా షీటీం ముందుందని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. జిల్లాలోని విద్యార్థినులు, మహిళా భద్రత కోసం నిరంతరం కృషి చేస్తున్న షీటీం సభ్యులు సౌజన్య, ప్రవీణలను ఎస్పీ శుక్రవారం అభినందించారు. పాఠశాలలు, కళాశాలల్లో గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ లాంటి కీలక అంశాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ.. విద్యార్థులకు సరైన మార్గదర్శనం చేసిన ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లకు క్యాష్ రివార్డు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. షీటీం నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు కొత్త చట్టాలపై అవగాహన పెరుగుతోందన్నారు. జిల్లా ప్రజలకు 8712686094 నంబరులో షీటీం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.



## వాల్ పేయింటింగ్ వేసిన జీవన్‌రెడ్డి

వరంగల్ జిల్లాలో నిర్వహించనున్న బీఆర్ఎస్ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్మూర్‌లో శుక్రవారం బీఆర్ఎస్ సభకు సంబంధించిన వాల్ పేయింటింగ్ వేశారు. అనంతరం స్టిక్కర్లను అతికించారు. కార్యక్రమంలో పట్టణాధ్యక్షుడు పూజ నరేందర్, లింగారెడ్డి పాల్గొన్నారు. - **అక్షరటుడే, ఆర్మూర్**

## ఉగ్రదాడి అమానవీయ చర్య: షబ్బీర్‌అలీ



**అక్షరటుడే, కామారెడ్డి:** జమ్ముకశ్మీర్ పహల్‌గామ్‌లో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో ముస్లిం మత పెద్దలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ మాట్లాడుతూ.. ఉగ్రదాడి అమానవీయ చర్య అని విచారం వ్యక్తం చేశారు. ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ప్రభుత్వం ఉగ్రవాదంపై తీసుకునే ఎలాంటి చర్య అయినా సరే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

## రజతోత్సవ సభను సక్సెస్ చేయాలి..


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

**అక్షరటుడే, నిజాంసాగర్:** వరంగల్‌లో నిర్వహించనున్న రజతోత్సవ సభను బీఆర్ఎస్ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మాజీ ఎంపీపీ జ్యోతి దుర్గారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం వరంగల్ రజతోత్సవ సభ పోస్టర్లను శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 27న వరంగల్‌లోని ఎల్కతుర్తిలో సభ జరుగనుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫోరం మాజీ అధ్యక్షుడు రమేశ్ గౌడ్, వైస్ ఎంపీపీ మనోహర్, పీఎస్ఎస్ ఛైర్మన్ విఠల్ రెడ్డి, పీఎస్ఎస్ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఇజ్రాయిల్‌లో కొవ్వొత్తుల నివాళి


రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో..

**పహల్‌గామ్ ఉగ్రదాడిలో అమరులైన వారికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. ఇజ్రాయిల్‌లో తెలంగాణ అసోసియేషన్, ఇందూరులో వీహెచ్‌పీ, రెడ్‌క్రాస్ సొసైటీ, ముస్లిం సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.**

# పహల్గామ్ ఉగ్రదాడి మృతులకు నివాళులు


బిచ్కుందలోని మసీదులో..


బాన్సువాడలో నివాళులర్పిస్తున్న ముస్లింలు


వీహెచ్‌పీ ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

## దొంగను పట్టుకున్న గ్రామస్థులు.. పోలీసులకు అప్పగింత

**అక్షరటుడే, ఇందల్వాయి:** వరుస చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగను ఇందల్వాయి గ్రామస్థులు వల వేసి గురువారం రాత్రి పట్టుకున్నారు. గ్రామస్థుల తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయిలో గతవారం ఏడిళ్లల్లో ఒకేరోజు చోరీలు జరిగాయి. దీంతో అప్రమత్తమైన గ్రామస్థులు ప్రతిరోజూ గస్తీ తిరుగుతున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి సైతం కారులో వచ్చిన నలుగురు దొంగలు గ్రామంలోని షేక్ నిస్సార్ హైమద్ ఇంట్లో చోరీ చేశారు. అనంతరం మరో ఇంట్లో చోరీ చేసేందుకు వెళ్తుండగా గ్రామస్థులు వెంబడించి ఓ దొంగను పట్టుకున్నారు. అనంతరం అతడిని పోలీసులకు అప్పగించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు. గ్రామస్థుడు నిస్సార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

బీర్కూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1999-2000 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు శుక్రవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. తోటి విద్యార్థులతో ఆనందంగా గడిపారు. విద్యాబుద్ధులను నేర్పిన ఉపాధ్యాయులను సత్కరించారు. - **అక్షరటుడే, బాన్సువాడ**

